# జరుగుబాటు

పంచముఖిని కలుసుకోబోతున్నందుకు సంతోషం అనిపించింది. రెండేళ్ళ క్రితం టౌన్‌లో ఓ పుస్తకాల షాపులో కనిపించిన పంచముఖి తను అక్కడికి కొంచెం దూరంలో వున్న ఓ పల్లెటూళ్ళో వీధిబడిని పెట్టుకుని భార్యపిల్లలతో జీవితాన్ని వెళ్ళదీస్తున్నట్లు చెప్పి నన్ను నా భార్యతో కలిసి వాళ్ళ ఇంటికి రమ్మని ఆహ్వానించాడు.

ఆ ఆహ్వానం అలాగే వుంది. ఎందువల్లనో ఆ ఊరికి వెళ్ళి పంచముఖి ఆతిథ్యాన్ని స్వీకరించలేకపోయాను.

ఇప్పుడు – మళ్ళీ పంచముఖి నుండి ఓ ఉత్తరం.

ప్రియ మిత్రమా....

మా ఊళ్ళో వెలిసిన దేవుడి గురించి, కొత్తగా కట్టిన ఆలయం గురించి మీకు తెలిసే వుంటుంది. చాలా దూర ప్రాంతాలనుండి ఎంతోమంది రోజూ ఈ దేవాలయాన్ని దర్శించి వెళుతున్నారు. నువ్వు కూడా వదినగారితో కలిసి ఈ ఆలయాన్ని దర్శించుకుంటే బావుంటుంది. ఇక్కడి దేవుడు భక్తుల కోరికలను వెంటనే తీరుస్తున్నాడట. వెంటనే బయల్దేరండి. నీ మిత్రుడు

పంచముఖి

పంచముఖి రాసిన ఈ ఉత్తరాన్ని నాకంటే ముందుగా నా అర్ధాంగి అరుణ చదివింది. అతను రాసిన ఉత్తరంలో ఆఖరి వాక్యం ఆమెను బాగా ఆకట్టుకుంది. ఎందుకంటే మాకు పెళ్ళయి పది సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు పిల్లలు పుట్టలేదు కాబట్టి.

ఆమె అంతర్యాన్ని గ్రహించినందున ఆ మరుసటి రోజు ఆఫీసుకు సెలవు పెట్టి పంచముఖి ఊరికి బస్సులో బయల్దేరాను భార్యా సమేతుడనై.

పొలాల మధ్యనుండి గతుకుల రోడ్డుమీద చిన్నగా వెళుతోంది బస్సు. మరికొన్ని గంటల్లో నా మిత్రుడు పంచముఖిని కలుసుకోబోతున్నాడనే ఫీలింగ్ నాలో బలంగా వుండిపోయింది. అనుక్షణం నా ఆలోచనల్లో అతనే.

బస్సు ఆగింది. అక్కడే అంతా దిగారు. అక్కడి నుండి బస్సు వెనక్కు తిరిగి వెళుతుందిట. మేమూ దిగాం. చిన్న వూరు. ఎర్రమట్టి రోడ్లు. బస్సు చోటనే సిగరెట్లు, పాన్‌పరాగ్‌లు అమ్మే షాపు వుంది. అక్కడే సోడాలు కూడా వున్నాయి. ఎండ ఓ మాదిరిగా వుంది.

"ఇల్లెక్కడో తెలుసుకోండి" అన్నది నా శ్రీమతి.

బస్సు దిగిన మనుషుల్లో ఒకాయనను అడిగాను. ఇంటి గుర్తులు చెప్పాడాయన. ఆ గుర్తులను బట్టి అక్కడికి ఆ ఇల్లు దగ్గరగానే వుండొచ్చు.

ఇద్దరం అక్కడినుండి ముందుకు నడిచాము.

కొంచెంసేపటికి పంచముఖి ఇంటిని తెలుసుకోవడం ఏమంత కష్టం కాలేదు. మేం వెళ్ళేసరికి ఆ పెంకుటింటి వసారాలో కొంతమంది పిల్లలు వెనక్కీ ముందుకీ ఊగుతూ కళ్ళు మూసుకుని పెద్దగా పాఠాలు చదువుతున్నారు. గోడవారగా ఇనుపకుర్చీలో కూర్చుని పంచముఖి రోడ్డుమీదకు చూస్తున్నడు.

మమ్మల్ని చూడటంతోనే లేచి ఎదురుగా వచ్చి నవ్వుతూ పలకరించి లోనికి ఆహ్వానించాడు.

గేటుకి కొంచెం దూరంలో పెద్ద వేపచెట్టు వుంది. చెట్టు పక్కనే వున్న పెద్ద తొట్టిలో నీళ్ళున్నాయి. అక్కడే మేమిద్దరం కాళ్ళు కడుక్కుని లోపలకు వెళ్ళాం.

పంచముఖి తన భార్యను సువర్చలగా పరిచయం చేశాడు. ఆమె బాగానే వుంది. పల్లెటూరి యువతిలాగే వుంది. కుదురుగా లేని చీరకట్టు. నుదుటిమీద వంకరటింకరగా వున్న తిలకంబొట్టు. చెవులకు వెడల్పాటి దిద్దులు. మొరటుతేలిన శరీరపు నునుపు.

ఆమెను కొంచెంసేపు ఆశ్చర్యంగా చూసింది. నా భార్య తర్వాత నావైపు చూసి అదోలా తమాషాగా నవ్వింది. గమనించారా! అన్నట్టుగా.... చూపులు మరల్చుకున్నాను.

ఆ పెంకుటింట్లో ఓ మాదిరి చీకటిగా వుంది. ఇంట్లో ఎక్కడా కిటికీలున్న జాడలే లేవు. పైన పెంకుల మధ్యలో ఎక్కడో ఎత్తుగా అమర్చిన ఓ అద్దం పెంకును చీల్చుకొని లోపలకు వస్తోంది ఓ మాదిరి వెలుతురు.

వసారాలో పిల్లల మధ్య కూర్చుని కునికిపాట్లు పడుతూ చదువుతున్న పంచముఖి పిల్లలు ముగ్గురూ వాళ్ళ మధ్యనుండి లేచి వచ్చాడు.

వాళ్ళకు మా గురించి చెప్పాడు పంచముఖి.

ఇద్దరబ్బాయిలు, ఒకమ్మాయి. పిల్లలు ముగ్గురూ దాదాపుగా తల్లి పోలికలో వున్నారు. ఇంట్లో కుర్చీలు లేని కారణంగా వేపచెట్టు కింద బడిపిల్లలచేత నులకమంచం వేయించి మా ఇద్దర్నీ ఆసీనులను చేశాడు.

అతను ఈజీగా నవ్వి "బయల్దేరండి.... గుడి ఇక్కడకు దగ్గరే.... అరగంటలో

మీకు దర్శనం, అర్చన పూర్తి చేయిస్తాను" అన్నాడు నిల్చుని.

"ఎలా!" ఆశ్చర్యంతో అడిగాను.

"ఎలాగంటే.... ఆ గుడి పూజారిగారి ఇద్దరు పిల్లలూ నా దగ్గరే చదువుతున్నారు. అలా" అన్నాడు మళ్ళీ చిన్నగా నవ్వి. ఐదు నిముషాల్లో వాళ్ళిద్దరూ, మేమిద్దరం బయల్దేరాము. పంచముఖి పిల్లలు ఇంట్లోనే వున్నారు.

అతను చెప్పినట్టుగానే గుడి దగ్గరగానే వుంది. కొత్తగా కట్టిన గుడి కాబట్టి ఇంకా కొంత పని మిగిలివుంది. మా ఆవిడలాగే నేనూ మీకు త్వరలో సంతానం కలగాలని కోరుకున్నాను. గుడి పూజారి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దర్శనానంతరం మా పేరున అర్చన కార్యక్రమం పూర్తి చేశాడు. మళ్ళీ అరగంట తర్వాత మేము ఇంట్లోనే వున్నాం.

"వచ్చిన పనైపోయింది.... థ్యాంక్స్ పంచముఖీ.... ఇక మేం బయల్దేరుతాం" అన్నాను.

"ఇప్పుడు కాదు. ఇంకో రెండు గంటలకు బస్సు వుంది. భోజనాలు కానిచ్చి వెళ్ళండి" అన్నాను.

సరేనన్నాను అయిష్టంగానే. ఎందుకంటే మేం వెళ్ళిన తర్వాత ఆ ఇంట్లో మాకు మర్యాదకోసమైనా కాఫీగాని, టీగానీ ఇవ్వలేదు. పంచముఖిని ఇబ్బందిపెట్టడం కష్టం లేదు. ఆ ఇంటి వాతావరణమే ఆ ఊళ్ళో అతని జరుగుబాటుకు అద్దంపడుతోంది.

పంచముఖి భార్య సువర్చల మాత్రం– "ఈ పల్లెటూళ్ళో సమయానికి ఏవీ దొరకవు. మీకు కనీసం కాఫీ కూడా ఇవ్వలేకపోయాం" అన్నది నొచ్చుకుంటున్నట్టు.

పంచముఖి పంతపాడాడు. నిజమే కావచ్చు.

"ఇంకోసారి వచ్చినప్పుడు రెండ్రోజులు వుంటాం" అన్నాను భోజనాల కార్యక్రమాన్ని వాయిదా వేయడానికి.

"అలా కాదు. భోజనం చెయ్యక తప్పదు" అనేశాడు పంచముఖి. ఇక నేను మాట్లాడలేదు.

రెండు నిముషాలకు "పంచముఖీ.... ఈ వూళ్ళో భోజనహోటలు ఏదయినా వుందా?" అనడిగాను.

అతను పెద్దగా నవ్వి, "ఇదొక గొప్ప పల్లెటూరు. కొత్తగా వెలసిన ఈ గుడి కారణంగానే ఈ ఊరికి మీలాంటి మనుషులు బయటినించి వస్తున్నారు.

ఇక్కడ యాత్రికులకు అవసరమైన సౌకర్యాలు అసలు లేవు. కొంతమంది గుడి ఆవరణలో చెట్ల కింద వాళ్ళ పొయ్యితో వంటలు చేసుకుంటారు.

అన్ని సౌకర్యాలూ అమరటానికి ఇంకొంచెం టైము పడుతుంది" అన్నాడు పంచముఖి.

"నువ్వు భోజనం ఏర్పాట్లు చూడు" అన్నాడు భార్యతో.

సువర్చల వెంటనే ఇంట్లోకి వెళ్ళి కూతురుచేత తండ్రికి కబురు చేసింది. "అమ్మ పిలుస్తోంది" అన్నదా అమ్మాయి.

లోపలకు వెళ్ళాడు పంచముఖి.

ఓ ఐదు నిముషాలకు తిరిగి వచ్చి- "చెప్పాను కదా.... ఈ పల్లెటూళ్ళో సరైన కూరలు కూడా దొరకవు.... మా పల్లెటూరి భోజనం చేసి మీరేమనుకుంటారోనని మా సువర్చల భయపడుతోంది" అన్నాడు నవ్వే ప్రయత్నం చేస్తూ.

"భయం లేదు పంచముఖీ.... పట్నం భోజనంతో విసిగిపోయి వున్నాం. మీ పల్లెటూరి భోజనం రిలీఫ్‌గా వుంటుంది. భయమెందుకు?" అన్నాను.

"మీ ఇష్టం" అన్నాడు.

మేమిలా మాట్లాడుకుంటున్నప్పుడే పంచముఖి పెద్ద కొడుకు పదేళ్ళవాడు ఓ స్టీలుగిన్నె తీసుకుని బయటకు పరుగుదీశాడు మా ముందునుండి.

కనుమరుగయ్యే వరకు నా భార్య వాడినే చూసింది.

కొద్దిసేపటికి వాడు ఆ ఖాళీ స్టీలుగిన్నెలో లోపలకు వచ్చి ఇంకో నిముషానికి మళ్ళీ బయటకు వెళ్ళాడు.

ఈసారి వాడు ఇంట్లోంచి బయటకు రాగానే.... లోపల్నించి "చుట్టాలొచ్చారని చెప్పు" అని సువర్చల కొడుకుతో అనడం మాకు వినిపించింది.

ఆ మాట వినబడగానే పంచముఖి మొహాన్ని గంభీరంగా మార్చుకుని రెండంగల్లో ఇంట్లోకి వెళ్ళాడు.

పిల్లాడు ఏదో అప్పుకోసం వెళ్ళివుంటాడు. మరి కొద్దిసేపటికి వాడు ఖాళీ గిన్నెతో తిరిగి వచ్చాడు. ఇంకొంచెంసేపటికి పంచముఖి కూతురు ఐదేళ్ళమ్మాయి ఓ వెదురుబుట్టతో బయటకు వెళ్ళింది.

పంచముఖి లోపల్నించి బయటకు రాలేదు.

అప్పుడే బయటకు వచ్చిన రెండో కొడుకును అడిగితే ఇంటి వెనుక దొడ్లో వున్నాడని చెప్పాడు.

ఇంటి వెనక్కు వెళ్ళాను. నేను వెళ్ళేసరికి పంచముఖి దొడ్లో వున్న ఆకుకూరల మొక్కల ఆకులను గిల్లిబుట్టలో వేస్తున్నాడు. నన్ను చూసి బలవంతంగా నవ్వి.

"మన పెరట్లో మనం పెంచుకున్న ఆకుకూరల రుచి దేనికీ సాటిరాదు" అన్నాడు.

"అవును...." అన్నాను అతనికి మహాయపడుతూ.

"నువ్వెళ్ళి విశ్రాంతి తీసుకో.... ఇప్పుడే వస్తాను" అని నన్ను చెట్టుకిందకు పంపించాడు.

నేను వెళ్ళి మంచంమీద కూర్చోగానే పంచముఖి కూతురు ఖాళీ వెదురుబుట్టతో ఏడుపు మొహంతో తిరిగివచ్చి ఇంట్లోకి వెళ్ళింది. అలా మరో మూడుసార్లు ఆ వెదురుబుట్టలతో ఇంట్లోకి బయటకూ తిరిగింది ఆ అమ్మాయి. పని జరిగినట్టు లేదు. ఈసారి ఆఖరి ప్రయత్నంగా పంచముఖి భార్యను సువర్చలతోనే ఓ సంచిని మడిచి చేతిలో పట్టుకుని బయటకు వెళ్ళింది.

"మనం చాలా ట్రబులిస్తున్నాం" అన్నది అరుణ ఇదంతా గమనిస్తున్నట్టు.

"ఏం చేద్దాం?" అన్నాను నేను.

"వెళదాం పదండీ" అంది అరుణ.

"వెళ్ళడానికిప్పుడు బస్సు లేదు కదా"

అరుణ మౌనం పూనింది ఆలోచిస్తూ. ఎప్పటికో సగం నిండిన సంచీని పమిటకొంగు చాటున పెట్టుకొని కొంచెం వికసించిన మొహంతో లోపలకు వచ్చింది సువర్చల.

ఆపైన కొంచెంసేపటికి ఇంట్లోనించి కట్టెలపొయ్యి వెలిగించే ప్రయత్నంగా— కిరోసిన్ వాసన, వంటింట్లో నుండి గుప్పున ధారాళమైన పొగా పైకి లేచి బయటకు దూసుకువచ్చాయి. అప్పుడు పంచముఖి తిరిగివచ్చి మాలో కలిశాడు. ఓ నిముషానికి ఏదో గుర్తు వచ్చినవాడిలా ఇంట్లోకి వెళ్ళాడు. అప్పుడు నేను పంచముఖి గురించి నా భార్యతో చెప్పాను.

చదువుకునే రోజుల్లో పంచముఖి బాగా చురుకైనవాడు. తెలివైనవాడు. ఫస్టు మార్కులన్నీ అతనివే. అతడిని చూస్తే నాకు అసూయగా వుండేది. అతనికి ఉజ్వలమైన భవిష్యత్తు వుందనీ, అతనో గొప్ప ఉద్యోగస్తుడు అవుతాడనీ

అనుకునేవాడిని.

డిగ్రీ పాసయిన నాకు మా నాన్న డబ్బుతో ఓ ఉద్యోగాన్ని కొనిచ్చాడు. ఆ ఉద్యోగంతో నేను ఓ స్వంత ఇంటినీ కొంత పొలాన్నీ సంపాదించాను. కానీ ఈ పల్లెటూళ్ళో పంచముఖి సరైన జరుగుబాటు కూడా లేకుండా ఆర్థికభద్రత లేని జీవితాన్ని గడుపుతున్నాడు.

మనిషి మేధస్సుతో పొంతన లేకుండా ఏ మనిషి జీవితమైనా కేవలం అదృష్టం మీదనే ఆధారపడటం చాలా దారుణం. నిజానికి నా చదువుకీ, నా తెలివితేటలకూ ఇప్పుడు పంచముఖి వున్న స్థానంలో నేను వుండడం ఎంతైనా న్యాయం.... కానీ అలా జరగలేదు. ఈ విషయంలో మనషులంతా అశక్తులు"

"ఇలాంటి మనుషులు ఈ దేశంలో ఎంతమంది వున్నారో?" అంది అరుణ.

"చాలామంది వుంటారనుకుంటాను"

మేమిలా మాట్లాడుకుంటున్నప్పుడే పంచముఖి కాళ్ళు కడుక్కుని భోజనానికి రమ్మని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ విధంగానే చేశాం. విస్తళ్ళలో భోజనం వడ్డించారు. రెండు పీటలు వేశారు. రకరకాల ఆకులతో చేసిన వంటకం. జాడీల్లోని ఊరగాయ పచ్చళ్ళతో ఆ భోజనాన్ని ముగించాము. అరుణ సరిగా తినలేకపోయింది.

భోజనం చేస్తున్నంతసేపూ పంచముఖి నొచ్చుకుంటూనే వున్నాడు. అలాంటి భోజనం పెట్టినందుకు. నేనేమీ ఫీలవలేదు. బయటకు వచ్చాక బయల్దేరటానికి ముందు "మీకు బాగా ట్రబులిచ్చాం" అన్నాను అతనితో.

"అలా అనకు. మీరు మా ఇంటికొచ్చినందుకు సంతోషంగా వుంది. మరోసారి తప్పక రావాలి" అన్నాడు.

"ఈ ఊరు కొంచెం డెవలప్ అయ్యాక" అన్నాను.

అతను అర్థం చేసుకున్నట్టు "మీ ఇష్టం" అన్నాడు.

"ఇక మేం బయల్దేరుతాం"

పంచముఖి మాతో బయల్దేరాడు బస్సు ఎక్కించడానికి ముగ్గురు పిల్లలనూ పిలిచాను. వాళ్ళికొద్దా మేం వెళుతున్నామని చెప్పి ముగ్గురికీ ఒక్కో వంద రూపాయల నోటిని ఇచ్చి "ఏమైనా కొనుక్కోండి" అన్నాను.

"ఎందుకు అన్నయ్యగారూ ఇవన్నీ" అంది సువర్చల.

"ఇలాంటివి నాకు నచ్చవు" అన్నాడు పంచముఖి.

"పంచముఖి.... అలా అనకు.... ఇదో అనుభూతి. ఒక్కసారి ఈ వయసులో మన చిన్నతనపు రోజులను గుర్తుచేసుకో.... ఇదొక సంప్రదాయం అనుకో" అన్నాను చాలా తేలిగ్గా.

సువర్చల మా అరుణకు మాత్రం బొట్టు పెట్టి దొడ్లో చెట్టుకు కాసిన ఓ దానిమ్మపండును ఇచ్చింది.

"సమయానికి ఇంట్లో ఒక్క జాకెట్టుముక్క కూడా లేదు" అన్నది సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు.

"నో ఫీలింగ్.... మీ అభిమానం కావాలి" అన్నాను.

బయల్దేరాం. మేం వెళ్ళేసరికి బస్సు రెడీగా వుంది. మమ్మల్ని బస్సు ఎక్కించి పంచముఖి వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళాక– "ఒక్కొక్కళ్ళకీ వంద రూపాయలు ఇచ్చారేం?" అన్నది అరుణ.

"గొప్పకోసం నేనలా ఇవ్వలేదు. ఆ కుటుంబం జరుగుబాటును చూశావు కదా! మనం లేకపోతే వాళ్ళు ఏం చేసేవాళ్ళో నాకు తెలీదు. పిల్లలకిచ్చిన డబ్బును పెద్దవాళ్ళు తీసుకుంటారని తెలుసు. కనీసం ఆ డబ్బుతో వాళ్ళు ఒక్క రోజయినా సుఖంగా బతుకుతారనే ఆశతో అలా చేశాను" సంజాయిషీ ఇచ్చుకున్నాను.

"క్షమించండి" అందామె నీళ్ళు నిండిన కళ్ళతో. ❖

*స్వాతి వారపత్రిక, 19-1-2007*